- రుణమాఫీ, రైతుబంధును అడ్డుకున్నది కాంగ్రెసోళ్లే
- 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవడం సాధ్యమేనా?
- భూములకు ఎసరు పెట్టేందుకే భూమాత
- ఆడబిడ్డల నీటికష్టాలు తీర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకం అందని ఇల్లు ఉందా?
- నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

# కాంగ్రెసోళ్లు రైతుల కడుపుకొట్టారు


ఆవంచ గ్రామంలో సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు


రుస్తుంపేట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 21: ఎన్నికలను ఎదుర్కొనే సత్తాలేక కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుబంధు, రుణమాఫీని అడ్డుకుని రైతుల కడుపుకొట్టారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని సీతారాంపూర్, రుస్తుంపేట్, ఆవంచ, రాంచంద్రాపూర్, తుల్జారాంపేట్, ఎల్లాపూర్, మాడాపూర్, గూడెంగడ్డ, కాగజ్‌మద్దూర్, నత్నాయిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు, పార్టీ శ్రేణులు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు రాష్ట్రం ఎట్లా ఉండే ఇప్పుడెట్లా ఉందో బేరీజు వేసుకుని ఓట్లు వేయాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో సరిగ్గా కరెంట్ లేక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు తరుచూ కాలిపోయేవని గుర్తుచేశారు. ఒకప్పటి తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు ఉండేవని, నేడు ఆత్మహత్యల్లేని రాష్ట్రంగా ముఖ్యమంత్రి కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. రైతులు సుఖసంతోషాలతో ఉండాలని సీఎం కేసీఆర్ రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ తదితర పథకాలు తీసుకొచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా గ్రామగ్రామాన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి చివరి గింజ వరకూ కొంటున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేయడం అంటే రైలు బండికి ఎదురెళ్లడమేనని, అంటే రిస్క్ తీసుకోవడమేనని ఆయన సూచించారు. రేవంత్ రెడ్డి మూడు గంటల కరెంట్ ఇస్తానని అంటున్నాడని, దీంతో రైతులకు ఎంత నష్టం జరుగుతుందో తెలుసుకోవాలన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మోటర్ల వద్ద మీటర్లు పెడితే రూ.10 వేల కోట్లు ఇస్తామని చెప్పినా సీఎం కేసీఆర్ వినలేదని, ఎన్ని కోట్లిచ్చినా మీటర్లు పెట్టనివ్వనని తెగేసిచెప్పారని గుర్తుచేశారు. గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీరు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ, సీసీ రోడ్లు తదితర పనులు చేయించారన్నారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు.

### 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవడం సాధ్యమేనా?

### - బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి

10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం చేయడం సాధ్యమేనా రేవంత్‌రెడ్డి.. అని నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ప్రచారంలో భాగంగా ఆమె మాట్లాడుతూ రేవంత్‌రెడ్డికి వ్యవసాయం మీద పూర్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ నిరంతరం కృషి చేస్తున్నాడని వెల్లడించారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని నమ్మిన వ్యక్తి కేసీఆర్ అని, కేసీఆర్ రైతుల పక్షపాతి అని అన్నారు. మహిళల సంక్షేమం కోసం ఆరోగ్యమహిళ, ఆరోగ్యలక్ష్మి, న్యూట్రీషన్ కిట్ తదితర పథకాలు తీసుకొచ్చారన్నారు. ఒకప్పుడు మహిళలు తాగునీటి కోసం తిప్పలు పడ్డారని, నేడు మిషన్ భగీరథతో అరుగు బయటే నీళ్లు పట్టుకుంటున్నారని అన్నారు. కులం, మతం, వర్గం అనే తేడా లేకుండా సీఎం కేసీఆర్ అందరికీ సంక్షేమ ఫలాలు అందించారన్నారు. యాదవులకు గొర్రెలు పంపిణీ చేసి వారి ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేయూతనందించిందన్నారు. మత్స్యకారులకు చేపలు, వాహనాలు, బీసీబంధు, దళితబంధు తదితర పథకాలు అందించారన్నారు. రూ.25 వేల కోట్ల రుణమాఫీకి రూ.23 వేల కోట్ల అందించారని, కాంగ్రెస్, బీజేపీ అడ్డుకోవడంతో కొంతమందికి సాధ్యపడలేదని, అధికారంలోకి రాగానే అందరికీ రుణమాఫీ అందజేస్తామన్నారు.

### అన్యాయం చేసినవాళ్లే బీసీ నినాదంతో వస్తున్నారు: సింగాయిపల్లి గోపి

బీసీలకు అన్యాయం చేసిన వారే నేడు బీసీ నినాదంతో మన ముందుకు వస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకుడు సింగాయిపల్లి గోపి తెలిపారు. గతంలో బీసీలకు ఏమి చేశారో ప్రజలకు వివరించాలని బీజేపీ అభ్యర్థిని ప్రశ్నించారు. పదవుల్లో ఉన్నప్పటికీ బీజేపీ అభ్యర్థి బీసీలకు ఎలాంటి సహాయం చేయలేదని విమర్శించారు. మాసాయిపేట్ మండలంలో బీసీ రైతుల భూములను గుంజుకున్న వ్యక్తి ఈటల రాజేందర్ అని విమర్శించారు. అన్ని కులాల వారు బీఆర్ఎస్ పార్టీకి మద్దతుగా ఉన్నారని, సునీతాలక్ష్మారెడ్డి గెలువడం ఖాయమన్నారు. ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైడి శ్రీధర్‌గుప్తా, నాయకులు సంతోష్‌రెడ్డి, సత్యంగౌడ్, హబీబ్‌ఖాన్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎంపీటీసీ సంధ్యాఛత్రునాయక్, మేఘమాల కిషన్, మాజీ ఎంపీపీ లలితానర్సింగ్, సర్పంచ్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


నీకే ఓటేస్తామని రుస్తుంపేట్‌లో సునీతారెడ్డికి హామీ ఇస్తున్న మహిళలు


రుస్తుంపేట్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను చూపిస్తున్న గ్రామస్తుడు

# కాంగ్రెస్ పాలనంతా కష్టాలమయమే

- 11 సార్లు గెలిచిన కాంగ్రెస్ రైతులకు కష్టాల్ని మిగిల్చింది
- 55 ఏండ్లలో జరగని పనులు తొమ్మిదేండ్లలో చేసి చూపించాం
- రైతుబంధు, రుణమాఫీ ఆపమని కాంగ్రెసోళ్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు..
- బీజేపీ, కాంగ్రెస్‌ల మాటలు నమ్మితే నట్టేట మునుగుతాం
- అసైన్డ్ భూములకు పట్టాలిస్తాం..
- మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి


కుర్తివాడలో పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం


యూసుఫ్‌పేట ప్రచారంలో గొర్రెపిల్ల, గొంగడితో పద్మారెడ్డి

పాపన్నపేట, నవంబర్ 21: 11 సార్లు గెలిచి 55 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ కరెంటు కష్టాలనే మిగిల్చిందని, కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాల పాలవుతామని మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాపన్నపేట మండలంలోని యూసూఫ్‌పేట, ఆరెపల్లి, కుర్తివాడ, దౌలాపూర్, మిన్‌పూర్, మల్లంపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో కేవలం ఏడు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చిందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు మళ్లీ తప్పవని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇస్తున్నదన్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే అసైన్‌మెంట్ భూముల నిబంధనలను సులభతరం చేసి భూ హక్కులు కల్పిస్తామన్నారు. పోడు భూములకు సైతం భూ హక్కులు కల్పించనున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు రైతుబంధు, పంట రుణమాఫీ ఆపాలని ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారన్నారు. కాంగ్రెస్ వాళ్లు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా గెలువలేరన్నారు. కాంగ్రెస్‌లో ఎప్పటికీ కుర్చీల కొట్లాట ఉంటుందన్నారు. గతంలో మెదక్ నుంచి గెలిచిన మైనంపల్లి 13 ఏండ్లుగా మెదక్ నియోజకవర్గాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఆయన కేవలం గిన్నెలు, గ్లాసులు ఇచ్చిండని, నీళ్లు లేనప్పుడు బోర్లు ఎందుకు వేయలేదని, ఇప్పుడేందుకు వేస్తున్నాడని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీల మాటలు నమ్మితే నట్టేట మునుగుతామన్నారు. కేసీఆర్ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఆమె వెంట మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుమ్మరి జగన్, జిల్లా రైతు కమిటీ అధ్యక్షుడు సోములు, పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, రైతు సమన్వయ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు దాసు, శ్రీనాథ్ రావు, స్రవంతి శ్రీనివాస్, లింగారెడ్డి, దానయ్య, నవీన్, రాణి కిష్టయ్య, విజయతిరుపతి రెడ్డి, పాపన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఏడుపాయల మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు శివశంకర్, మనోహర్, వెంకటేశం, సాయిలు, పెంటయ్య, నాయకులు దుర్గయ్య, సాయిరెడ్డి, కిష్టారెడ్డి, రఘు, భూషణం, గోపాల్, లక్ష్మాగౌడ్, ఉస్మాన్ గౌడ్, వెంకటేశం ఉన్నారు.


పాపన్నపేట మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారెడ్డి ఎన్నికల ప్రచారం

కుర్తివాడలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్న గ్రామస్తులు

